క్లుప్తంగా

మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దు



పలిమెల: ప్రభుత్వ విధానాలకు, ప్రజా జీవనానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దని పలిమెల ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గొత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని, సహకరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్: తెలంగాణ నేతకాని మహార్ కుల హక్కుల పరిరక్షణ సంఘం భూపాలపల్లి మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజమౌళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా దుర్గం సాగర్, మహిళా అధ్యక్షురాలిగా చల్లూరి మమత, యూత్ అధ్యక్షుడిగా చల్లూరి మహేష్, సైనిక్ దళ్ అధ్యక్షుడిగా బౌతు నరేష్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా బౌతు విజయ్, టౌన్ అధ్యక్షుడిగా దుర్గం అంజనేయులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జువ్వాజి తిరుపతి, రత్నంప్రదీప్, దుర్గం భిక్షపతి, బౌతు రమేష్, దుర్గం రాధ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



ములుగు: జిల్లా కేంద్రంలో మాస్టర్ తనుగుల అనిల్‌యాదవ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన తైక్వాండో శిక్షణ తరగతులను సీఐ రంజిత్‌కుమార్ ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలని సూచించారు. 40 మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని మెడల్స్ సాధించడం అభినందనీయం అన్నారు. వాసుదేవరెడ్డి, రాజువర్ధన్, సమ్మయ్య, మాస్టర్ జన్ను విక్రం పాల్గొన్నారు.

ఆర్థికసాయం

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన మంద రాములు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతుండగా గంగిరేణిగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో అతడితోపాటు టెన్త్ చదువుకున్న మిత్రులు ఆదివారం రూ.50 వేలు సాయం అందజేశారు. తనకు సాయం చేసిన మిత్రులకు రాములు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లాల్‌సింగ్, గుగులోతు కృష్ణ, షాబుద్దీన్, నాగరాజు, శ్యామ్, సందీప్, శివరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


పరకాల : తమకు కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక మున్సిపాలిటీ ఆర్పీలు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు అమరావతి, కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడారు. సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) స్థాపించినప్పటి నుంచి పని చేస్తున్నామని తెలిపారు. వీఎల్ఆర్, స్త్రీనిధి నిధుల నుంచి గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనలను తొలగించి ప్రభుత్వ వేతనం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పాత ఆర్పీలను యధావిధిగా కొనసాగించడంతోపాటు ప్రతినెలా వేతనాలు రూ.18 వేలు చొప్పున అందించేలా చూడాలని, డ్రెస్ కోడ్, ఐడీ కార్డులు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని కోరారు. సంఘం నాయకులు సాంబయ్య, ఉమాదేవి, స్వప్న, శీల, జయప్రద పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించాలి

నల్లబెల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెడ్లలోని పేదలందరికి సంక్షేమ ఫలాలు అందించాలని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేదల కోసం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పాలకులు పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. త్వరలోనే సంఘం భవన నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో అడ్మిషన్లు

- ఈనెల 15 వరకు దరఖాస్తులకు చివరి అవకాశం
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష
- 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు అవకాశం



మొగుళ్లపల్లి మండలంలోని కోర్కిశాల మోడల్‌స్కూల్

మొగుళ్లపల్లి: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొగుళ్లపల్లి, చిట్యాల, కాటారం, గణపురం, మహాముత్తారం, మల్హర్ మండలాలల్లో ఈ పాఠశాలలు ఉన్నాయి. తెలంగాణ మోడల్ స్కూల్ 2023–24 విద్యాసంవత్సరం ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 6వ తరగతిలో ప్రవేశం, 7, 8, 9, 10వ తరగతుల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్షకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

6వ తరగతితో పాటు ఇతర తరగతుల్లో అడ్మిషన్ల కోసం ఈ నెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 12లోగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అదే నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, ఓబీసీ, జనరల్ కేటగిరీలకు చెందిన పిల్లలకు రూ.200ల ఫీజు చెల్లించాలి. 6వ తరగతికి ఒక్కో పాఠశాలలో 100 మంది విద్యార్థుల ప్రవేశం ఉంటుంది. దీంతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతిలో మధ్యలో వివిధ కారణాలతో మానివేసిన ఖాళీ సీట్ల ప్రవేశం కోసం అవకాశం ఉంటుంది.

ప్రత్యేకతలివే..

- ఎటువంటి రుసుం లేకుండా ఆంగ్ల మాధ్యమంలో విద్య బోధన.
- పక్కా భవనంతో తరగతి గదులు.
- నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం
- ఉచితంగా ప్రభుత్వమే పుస్తకాలను అందజేస్తుంది.
- 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ప్రతిభ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ.
- సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ సదుపాయం.
- 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌టీఎస్‌ఎకు ప్రత్యేక శిక్షణ తరగతులు.

స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం



ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో ఆరో తరగతిలో 100 సీట్లు మిగితా నుంచి 10వ తర గతి వరకు ఖాళీలను భర్తీ చేస్తాం. స్థానిక విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తాం.

–హైమావతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, కోర్కిశాల, మొగుళ్లపల్లి

ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు



బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: మూడు రోజులుగా మండలంలోని రామకృష్ణపూర్(టీ) కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు భూలక్ష్మీ, మహాలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపనతో ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం యంత్ర ప్రతిష్ఠలో భాగంగా ప్రతిష్ఠాస్థలం, గర్భశుద్ధి, ధాతున్యాసము, రత్నన్యాసము, భీజన్యాసము వంటి ప్రత్యేక పూజలను ప్రధానార్చకులు బాలశంకరశాస్త్రీ వేద మంత్రోచ్ఛరణలు, మేళ తాళాల మధ్య విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, సర్పంచ్ గునిగంటి మహేందర్, ఎంపీటీసీ ఆది సునీత రఘు, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, బీఆర్ఎస్ సీనియర్ జిల్లా నాయకుడు కత్తి సంపత్, పింగిళి నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, బండెల నవీన్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఎమ్మెల్సీ మధుసూదనాచారి



వేడుకల్లో పాల్గొన్న గండ్ర సత్యనారాయణరావు

ఆరెపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ఆరెపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్ అవార్డు వరించింది. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి హైదరాబాద్‌లో తెలంగాణ సార్వత్రిక విద్యా పరిషత్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన ఆరేపల్లి శ్రీనివాస్‌కు సేవాభారతి సంస్థ ద్వారా 26 సంవత్సరాల నుంచి చేస్తున్న సేవలను గుర్తించి వారికి డాక్టరేట్ అవార్డును అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిలిం చాంబర్ ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్, చిన్నారెడ్డి, లయన్ కోటేశ్వరరావు, స్నేహలతా రెడ్డి, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్‌లు అవార్డును అందజేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆకుల సోమయ్య, కుసుమ లక్ష్మణ్, ఎడ్ల భిక్షపతి, పెద్ది శ్రీను, మొర్రి కుమార్, మొర్రి పవన్, ఉప్పుల చంద్రంతో పాటు 200 మంది కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు, జిల్లా యువజన నాయకుడు జక్కు రాకేష్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పరామర్శ

మండలంలోని నాచారం గ్రామానికి చెందిన ఖాజాబీ, కవిత, శ్రీను ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాలను పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క సూర్యప్రకాష్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, మండల యూత్ అధ్యక్షుడు జాగరీ హరీష్, సర్పంచ్ కాసాని రామయ్య, మంథని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుట్టపాక శ్రీనివాస్, నాయకులు కోట రవి, తాజోద్దీన్, వాల యాదగిరిరావు, కాసాని శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న శ్రీనివాస్

మంగపేట: మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి దేవేందర్‌రావు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీ భవిష్యత్ కార్యక్రమాల కార్యాచరణ గురించి నాయకులతో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. మండల పరిధిలోని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానంగా 24 గంటల త్రీ ఫేజ్ కరెంటు సరఫరాలో కోతలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీల పెంపు, మండలంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు, ఇంటి పన్నుల మోత తదితర సమస్యలపై పోరాటం చేయాలన్నారు. మండలంలో స్థానిక ఎన్నికలు జరుగకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పనులు జరుగడంలేదని అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని త్వరితగతిన రాష్ట్ర ప్రభుత్వం మండల పరిధిలో స్థానిక ఎన్నికలు జరిగే విధంగా చొరవ చూపాలన్నారు. ఈనెల 10 నుంచి 25 వరకు నిర్వహించే బూత్ కార్నర్ సమావేశాలకు ప్రతి కార్యకర్త సహకరించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్దన్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి రవీందర్, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు దంతెనపల్లి నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి మల్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు సయ్యద్ నాగుల్‌మీరా, యాకూబ్‌పాష, కార్యవర్గ సభ్యుడు రామిడి సురేష్‌తో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



మహదేవపూర్: భూమి పూజ చేస్తున్న సర్పంచ్



మంగపేటలో..

మహదేవపూర్: మండల కేంద్రంలోని మేర కుల సంఘం మండల అధ్యక్షుడు కొక్కు రమేశ్ ఆధ్వర్యంలో జలగిరి శంకర దాసమయ్య దేవాలయం నిర్మాణానికి సర్పంచ్ శ్రీపతిబాపు ఆదివారం భూమిపూజ చేశారు. మేర కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గట్ల రమేశ్ ఆలయ నిర్మాణానికి తొలి విరాళంగా రూ.11,116 నగదును అందజేశారు. సంఘం సంకల్పం గొప్పదని, దేవాలయ నిర్మాణ కార్యం గ్రామానికి శక్తినిచ్చేదని సర్పంచ్ పేర్కొన్నారు. దేవాలయం నిర్మాణ పనుల్లో తమ వంతుగా సహాయం చేస్తామన్నారు. భవనానికి స్లాబు వేయుటకు రూ.2.5లక్షలు గ్రామ పంచాయతీ నిధులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుడాల అరుణ శ్రీనివాస్, మేర కుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి అడుప రాజా రమణయ్య, గౌరవ అధ్యక్షుడు కొక్కు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొక్కు మధూకర్, కోశాధికారి పెండ్యాల రాజయ్య, సంఘ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముఖద్వార నిర్మాణానికి..

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ముఖద్వార నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన దాత కరి వెంకాయమ్మ ఆమె భర్త కరి సుబ్బారావు జ్ఞాపకార్థంగా సుమారు రూ.1.50 లక్షలతో నిర్మిస్తున్న ఆలయ ముఖద్వార పనును ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీధర్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి జీడికంటి మధుసూదనాచారి, దాత వెంకాయమ్మ, ఆలయ కమిటీ సభ్యులు మన్నె నాగేశ్వర్‌రావు ఉమా దంపతులు, ఝగ్రంశెట్టి రామకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ప్రజలు తరలిరావాలి



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేడు(సోమవారం) మేడారం నుంచి ప్రారంభించనున్న హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమ్మక్క–సారలమ్మ సన్నిధి నుంచి రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర అమ్మవార్ల దీవెనలతో విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా తాడ్వాయి మండల కేంద్రంలో జాతర రహదారికి ఇరువైపుల ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలతో కలకలలాడుతోంది. ఈ సమావేశంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాక సాంబయ్య, స్థానిక సర్పంచ్ ఇర్ప సునీల్, జిల్లా నాయకులు ఆరెం లచ్చు పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, జగదీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, మండల సీనియర్ హనుమాండ్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

మంగపేట: మేడారం సమ్మక్క–సారలమ్మ సన్నిధి నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేడు(సోమవారం) ప్రారంభించనున్న యాత్రకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడెల నరేష్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆక్రమార్కుల పాలకుల నుంచి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకునేందుకు చేపడుతున్న హాథ్ సే హాథ్ యాత్రలో అందరు భాస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

మేడారంలో టీపీసీసీ అధ్యక్షుడు ప్రారంభించనున్న యాత్రకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు యాత్ర మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ మండల కమిటీ నాయకులు గ్రామాల్లో యాత్ర వాల్ పోస్టర్లతో ప్రచారం నిర్వహించారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లికి చెందిన బొజ్జపెల్లి రవీందర్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి ఆదివారం పరామర్శించారు. సర్పంచ్ మిట్టపెల్లి వనమ్మచంద్రయ్య, ఉప సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, బొజ్జపెల్లి శంకరయ్య, సొల్లేటి రాములు, లింగారెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

మిర్చి తోటలకు 'వైరస్' బెడద

- లేత సమయంలో నల్ల తామర, నల్లి పురుగు
- కాపు దశలో ఎర్రగా మారుతున్న పంట
- అయోమయంలో రైతన్న

గత ఏడాది మిర్చి పంట రైతులను నిండా ముంచింది. అయినా రైతన్న వెనుకడుగు వేయకుండా గతంలో చేసిన అప్పులు తీర్చడానికి ఈ సంవత్సరం తిరిగి మిర్చి పంటను మళ్లీ వేశాడు. ఈ సారైన పంట దిగుబడి వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు 'నల్లి పురుగు' 'నల్ల తామర', 'పండాకు' రూపంలో గండం వచ్చిపడింది. మిర్చి తోటలు ప్రారంభంలో కొంత మంచిగానే కనిపించిన ప్రస్తుతం వైరస్ సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

– వాజేడు



మిర్చి తోటకు మందు పిచికారీ చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్‌లో) తెగులు సోకిన మొక్క

గత ఏడాది మిర్చి రైతులను ఇబ్బందులకు గురి చేసిన నల్ల తామర, నల్లి పురగు వాజేడు మండలంలోని పంటల్లో మరోసారి విజృంభిస్తుంది. ఇప్పటికే పలు మిర్చి తోటల్లో నల్ల తామర, నల్లి పురుగు చేరింది. దాని నివారణ కోసం రైతులు వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నప్పటికీ నివారణ సాధ్యం కావడంలేదు. మండల వ్యాప్తంగా ఈ సంవత్సరం సుమారు 7000 ఎకరాలకు మిర్చి పంటను సాగు చేశారు. ముందుగా సాగు చేసిన తోటల్లో మిర్చి కాయాలు కోస్తుండగా లేత తోటల్లో పూత, పిందె దశలో ఉన్నాయి. ముదురు, లేత తోటలు అనే తేడా లేకుండా అన్ని తోటల్లోని పూతలో నల్ల తామర పురుగు చేరి పంటను నాశనం చేస్తుంది. ముఖ్యంగా లేత సమయంలో పురుగు విజృంభన మరి ఎక్కువగా కనిపిస్తుంది. దీని మూలంగా కాపు రాక పోగా చెట్టు ఎదుగుదల మందగించింది.

కాపు దశలో పండాకు తెగులు

మండలంలో కొన్ని తోటల్లో పండాకు తెగులు(ఎరుపు తెగులు) వచ్చింది. మిర్చి తోటలు కాపు దశలో ఉన్న సమయంలో పంట ఎర్రగా మారడంతో రైతులు దానిని ఎలా నివారించాలో అర్థం కాక అయోమయంలో పడుతున్నారు. ఎదుగుతున్న మొక్కలు ఒక్క సారిగా పండాకు రావడంతో ఆకులు, కాయలు రాలి పోతున్నాయి. ఇది వైరస్ తెగులుగా రైతులు భావిస్తున్నారు. దీంతో పంట చేతికి వస్తుందో లేదో అని భయపడుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి



మండలంలో నల్లి పురుగు దాడి ఎక్కువగా ఉంది. రైతులు పురుగు నిర్మూలనకు నివారణ చర్యలు చేపట్టాలి. ఇందు కోసం మూడు దఫాలుగా మందులను పిచికారీ చేయాలి. మొదటి సారిగా ఎకరానికి 100 గ్రాముల పిప్రోనిల్ 40 శాతం, 100 ఎమ్ఎల్ ఇమిడ క్లోపిడ్ 40 శాతంను అర లీటరు నీమాయిల్ 10 పీపీఎమ్‌లో కలిపి పిచికారీ చేయాలి. రెండవ దఫాలో 100 గ్రాముల పిప్రోనిల్ 80 శాతంను పిచికారీ చేయాలి. అలాగే మూడవ దఫా 100 ఎమ్ఎల్ కీఫాన్‌ను నీమాయిల్‌లో కలిపి పిచికారీ చేస్తే నల్లి నివారణ సాధ్యం అవుతుంది.

– ఏఓ నర్సింహారావు

108 వాహనంలో ప్రసవం



ఏటూరునాగారం: కన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఒ మహిళ 108 వాహనంలో ప్రసవించన సంఘటన మండలంలోని రొయ్యూర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. కన్నాయిగూడెం గ్రామానికి చెంది రవళి అనే మహిళ ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో 108కు సమాచారం అందించారు. అనంతరం ఏటూరునగారం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో పాపకు జన్మనిచ్చిందని తెలిపారు. కాగా మహిళకు ఈఎంటీ యుగేందర్ ఫైలెట్ దశరథం వైద్య సేవలను అందజేశారు.